సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

పదపదవే వయ్యారి గాలిపటమా..


పతంగులను ఎగురవేసే దారాలు

- సంక్రాంతి వేళ.. పతంగుల హేల
- జోరుగా రెడీమేడ్ గాలిపటాల విక్రయాలు

సీతంపేట: సంక్రాంతి అంటేనే పతంగుల పండగ. ఈ సెలవుల్లో పిల్లలు కేరింతలు కొడుతూ గాలిపటాలు ఎగురవేస్తుంటారు. రెక్కలు లేని పక్షుల్లా అవి నింగికి ఎగిరి కనువిందు చేస్తుంటాయి. తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే సంక్రాంతి పండగంటే రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మలు, డూడూ బసవన్నలు, హరిదాసులు, పిండి వంటలే కాదు.. పతంగులు ఎగరవేయడాన్ని అందరూ ఇష్టపడుతుంటారు. సంక్రాంతిని కొన్ని పట్టణాల్లో కైట్స్ ఫెస్టివల్‌గా నిర్వహిస్తుంటారు.

గాలిపటాలను చూస్తేనే పిల్లలు కేరింతలు కొడుతుంటారు. వాటిని ఎగర వేయడమంటే సరదా. వయసును కూడా మరిచి పిల్లలతో కలిసి పెద్దలు కూడా పతంగులు ఎరుగువేస్తుంటారు. చిన్నప్పుడు చాలా మంది రకరకాల కాగితాలతో స్వయంగా పతంగులు తయారు చేసి గాలిలో ఎగురవేసే ఉంటారు. ఇపుడు అంతగా శ్రమపడక్కరలేదు. వివిధ రంగులు, డిజైన్లలో రెడీమేడ్ పతంగులు మార్కెట్‌లో కొలువుదీరాయి. శంకరమఠం రోడ్, అక్కయ్యపాలెం పాలబూత్ సెంటర్‌లో దుకాణాలు ఏర్పాటు చేసి జోరుగా విక్రయిస్తున్నారు. పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా కొనుగోలు చేస్తున్నారు. పేపర్, పాలిథిన్, క్లాత్‌తో తయారు చేసిన మూడు రకాల గాలిపటాలు వివిధ ధరల్లో లభ్యమవుతున్నాయి.


శంకరమఠం రోడ్డులో విక్రయిస్తున్న గాలిపటాలు

అందరికీ నచ్చే డిజైన్లు..

గబ్బిలం, గ్రద్ధ, బటర్‌ఫ్లై, ఏంజిల్, గుడ్లగూబ, రామచిలుక ఆకారాల్లో క్లాత్‌తో చేసిన గాలిపటాలు పిల్లలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. బెన్‌టెన్, స్పైడర్‌మ్యాన్, డోరేమాన్, చోటా భీం, టామ్ అండ్ జెర్రీ, సినీతారల ముఖచిత్రాలతో తయారు చేసిన పతంగులు ఆకర్షిస్తున్నాయి. రూ.5 నుంచి రూ.300 వరకు ఖరీదైన పలు రకాల ఆకర్షణీయమైన గాలిపటాలు లభిస్తున్నాయి. వాటిని ఎగురవేయడానికి మాండియా దారం రూ.30 నుంచి రూ.250 ధరల్లో విక్రయిస్తున్నారు. మరింకెందుకు ఆలస్యం.. తగు జాగ్రత్తలు పాటిస్తూ ఈ సంక్రాంతికి వయ్యారి గాలిపటాలను నింగిలోకి ఎగురవేసేద్దాం.


ఏంజిల్, రామచిలుక, గ్రద్ధ ఆకారాల్లో ఆకర్షిస్తున్న పతంగులు

క్లుప్తంగా

షిర్డీసాయికి ప్రత్యేక పూజలు


సాయిబాబాను దర్శించుకుంటున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, భక్తులు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రసన్న వేంకటేశ్వరుడికి ధనుర్మాస పూజలు నిర్వహించారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ బాబాను దర్శించుకున్నారు. ఆయనకు ప్రధాన అర్చకుడు రాజా స్వామి తీర్థ ప్రసాదాలు అందిజేశారు. కార్యక్రమంలో అర్చకుడు వంశీ, సిబ్బంది శివ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

యూజర్ చార్జీలు, ప్లాస్టిక్ నిషేధంపై డ్రైవ్

మత్రిపాలెం: జీవీఎంసీ జోన్-5 పరిధి కంచరపాలెం నుంచి మత్రిపాలెం వరకు యూజర్ చార్జీలు, ప్లాస్టిక్ కవర్ల వాడకంపై గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఆదేశాల మేరకు ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్ సచివాలయ సిబ్బందితో కలిసి ఈ ప్రాంతాల్లోని షాపులన్నింటినీ సందర్శించి యూజర్ చార్జీలను వసూలు చేశారు. ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించి, యూజర్ చార్జీలు చెల్లించని వారిపై, ప్లాస్టిక్ వాడుతున్న వారిపై జరిమానా విధించారు. 10 షాపుల నుంచి యూజర్ చార్జీలు రూ.20 వేలు, ప్లాస్టిక్ నిషేధంపై 4 షాపుల నుంచి రూ.2 వేలు ఫైన్ కట్టించుకున్నట్టు డాక్టర్ రాజేష్ తెలిపారు.

ఘనంగా ఉర్సు ఉత్సవం

మత్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు మత్రిపాలెంలో మసీదు వద్ద హజరత్ మౌలా ఆలీ నిషాని(ఉర్సు) ఉత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ బర్కత్ ఆలీతో కలిసి వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎండీ గౌస్, మున్నా, నాకీర్, షేక్ బాబ్జి, జ్ఞానేష్, రామారావు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

రిటైనింగ్ వాల్ పరిశీలన


నరేంద్రనగర్‌లో ఆధునికీకరించిన గోడను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బర్కత్ అలీ

మత్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు నరేంద్రనగర్ వద్ద ఉన్న హిందూ శ్మశానవాటిక రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా గోడను గురువారం కార్పొరేటర్ బర్కత్ అలీ పరిశీలించారు. ఇటీవల ప్రభుత్వం అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా శ్మశానవాటిక గోడ ఆధునీకరణకు రూ.45 లక్షలు మంజూరు చేయగా.. గతేడాది నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు గోడ నిర్మాణం పూర్తవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

కృష్ణుడిగా కల్యాణ వేంకటేశ్వరుడు


లలితా పీఠంలో శ్రీకృష్ణుడి అలంకారంలో వెంకన్న

సీతంపేట: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గురువారం లలితానగర్ లలితా పీఠంలో కొలువైన కల్యాణ వేంకటేశ్వర స్వామి శ్రీకృష్ణుడి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చాడు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. నిత్యకైంకర్య సేవలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం ఉదయ 9 గంటలకు పీఠంలో గోదారంగనాయకుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిపిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

అర్హులందరికీ పథకాలు అందేలా కృషి


కార్పొరేటర్లు, నాయకులతో సమీక్షిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

సీతమ్మధార: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం కార్పొరేటర్లు, నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికీ చేరుతున్నాయా లేదా లేని పక్షంలో వారికి అండగా ఉండి పథకాలు అందేలా చూడాలని సూచించారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ప్రజలకు తెలిసేలా వివరించాలన్నారు. వార్డు సచివాలయం కన్వీనర్లు, గృహసారథుల నియామకంపై చర్చించారు. సేవా దృక్పథం కలిగిన వారు, అంకితభావంతో ప్రజల కోసం పనిచేసే వారిని నియమించాలని సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ బర్కత్ అలీ, కార్పొరేటర్లు కటారి అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, కె.కామేశ్వరి, వి.ప్రసాద్, శశికళ, పార్టీ వార్డు అధ్యక్షులు పైడి రమణ, నీలి రవి, కె.పి.రత్నాకర్, మాజీ కార్పొరేటర్లు, బాక్సర్ రాజు, బులుసు జగదీష్, కె.వెంగళరావు, గుడ్ల అశోక్ రెడ్డి, కర్రి రామారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రోడ్లు పాడవకుండా పండగ చేస్కోండి


మాట్లాడుతున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: రహదారులకు నష్టం కలిగించకుండా భోగి పండగను సంప్రదాయకంగా జరుపుకోవాలని 25వ వార్డు ప్రజలను జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ కోరారు. తన కార్యాలయంలో గురువారం స్థానికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్డులోని సీతంపేట, రాధాకృష్ణ ఆలయం, గణేష్‌నగర్, శాంతిపురం, రాజేంద్రనగర్, గొల్లవీధి ప్రాంతాల్లో ఇటీవల సుమారు రూ.3 కోట్లతో కొత్తగా రహదారులు నిర్మించినట్లు తెలిపారు. అవి పాడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకుని భోగి మంటలు వేయాలని సూచించారు. గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, సచివాలయ అడ్మిన్లు, కార్యదర్శులు, వలంటీర్లు ఈ విషయంలో సహకరించాలని కోరారు. ప్రతి వలంటీర్ తమ పరిధిలో రోడ్లు పాడవకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో గొర్రెల శ్రీను, అప్పన్న, సన్నీ, గౌరి, శ్రీను, నాయుడు, బాబు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లలకు వితరణ


దివ్యాంగ పిల్లలతో మానవ హక్కుల సంఘు రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్‌రావు

మత్రిపాలెం: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో గురువారం జాతీయ యువజన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్ జన్మదినం సందర్భంగా ఆయన చేతుల మీదుగా 51వ వార్డు మాధవధారలోని కేర్ అండ్ లవ్ అనాథాశ్రమంలో దివ్యాంగ పిల్లలకు అన్నదానం నిమిత్తం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ముందుగా స్వామి వివేకానందకు నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్.రవీంద్ర భరత్, ఉపాధ్యక్షులు బి.దామోదరరావు, వి.నారాయణ, రాష్ట్ర కార్యదర్శులు ఆశాజ్యోతి, పి.శ్రీహరి, జిల్లా అధ్యక్షుడు, పి.మల్లేశ్వరరావు, రాష్ట్ర యువజన కార్యదర్శి టి.అశోక్, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి దమయంతి, రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రంగవల్లులు


మొదటి బహుమతి గెలుపొందిన నవరత్నాల ముగ్గు


ప్రథమ బహుమతి అందజేస్తున్న కె.కె.రాజు, ఉషశ్రీ

- 43వ వార్డులో సంక్రాంతి సంబరాలు
- మహిళలకు ముగ్గుల పోటీలు

సీతంపేట: సంక్రాంతి సంబరాల్లో భాగంగా జీవీఎంసీ 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యంలో గురువారం 80 ఫీట్ రోడ్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. 70 మంది స్థానిక మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొని సంక్రాంతి గొప్పతనం ప్రతిబింబించేలా వేసిన రంగు రంగుల ముగ్గులు ఆకట్టుకున్నాయి. ఈ పోటీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలను చక్కగా వివరించేలా ఎస్.పార్వతి వేసిన ముగ్గుకు ప్రథమ బహుమతి లభించింది. ధనుర్మాస విశిష్టత తెలిపేలా కె.మంగ వేసిన రథం ముగ్గుకు రెండో బహుమతి వచ్చింది. బి.లలిత మూడో బహుమతి గెలుపొందారు. ముఖ్య అతిథి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ముగ్గులను తిలకించారు. విజేతలతోపాటు పోటీలో పాల్గొన్న మహిళలందరికీ బహుమతులు అందజేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'గ్రీవెన్స్'

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గురువారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలువురు నియోజకవర్గ ప్రజలు ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. వాటిని కె.కె.రాజు పరిశీలించి కొన్నింటిని తక్షణం పరిష్కరించారు. మరికొన్ని అర్జీలను సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ నార్త్
9912440606

రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ టోకరా

- ముగ్గురి నుంచి రూ.7.77 లక్షల వసూలు
- ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో బాధితుల ఫిర్యాదు

సీతమ్మధార: రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి ముగ్గురి నుంచి రూ.7.77 లక్షలు తీసుకుని మోసం చేసిన ఘటన ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఉద్యోగాలు రాకపోవడంతో బాధితులు ఫోర్త్ టౌన్ పోలీసులను ఆశ్రయించారు. సీఐ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఎస్‌ఐ ప్రమీల కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలేనికి చెందిన పుచ్చా రమణారావు రైల్వేలో ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఇతడికి పదేళ్ల కిందట రైల్వే న్యూకాలనీ తాటిచెట్లపాలేనికి చెందిన దువ్వి కాశీప్రసాద్ పరిచయమయ్యాడు. యూనియన్ కోటాలో క్లాస్-4, క్లాస్-3లో ఉద్యోగాలు ఉన్నాయని, రూ.12 లక్షలు ఇస్తే ఇప్పిస్తామని అతడిని నమ్మించాడు. గతేడాది ఫిబ్రవరిలో కాశీప్రసాద్ కొడుకు దువ్వి వంశీకృష్ణకు క్లాస్-4, మేనల్లుడు జానా పవన్‌కుమార్‌కు క్లాస్-3 ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి ఫోన్‌పే ద్వారా రూ.4,15,000, నగదు రూపంలో రూ.లక్షా 67 వేలు కలిపి మొత్తం రూ.5,82,000 వసూలు చేశాడు. మరో నిరుద్యోగి ఆకుల ఉమేష్ వద్ద నుంచి క్లాస్-4 ఉద్యోగం ఇప్పిస్తామని రూ.1 లక్షా 95 వేలు నగదు తీసుకుని ఏపీవో(వాల్తేరు) ఎ.రామారావు పేరుతో నకిలీ ఆర్డర్ పత్రాలు ఇచ్చాడు. బాధితులు ఉద్యోగం కోసం అడిగితే తొందర పడొద్దని రమణారావు బదులివ్వడంతో అనుమానం వచ్చి యూనియన్ నాయకుడిని వారు కలవగా.. అది ఫేక్ ఆర్డర్ అని చెప్పారు. మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సీతమ్మధార: విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించే నిమిత్తం శుక్రవారం అశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలోని 11 కేవీ ఏఎస్సార్ నగర్ ఫీడర్, 11 కేవీ వుడా చిల్డ్రన్ పార్కు ఫీడర్, 11 కేవీ టీపీటీ కాలనీ ఫీడర్, 11 కేవీ పీఅండ్‌టీ కాలనీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-1 ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. షిర్డీసాయి దేవాలయం, ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్, ఏఎస్సార్ నగర్, అల్లూరి సీతారామరాజు జంక్షన్, వుడా చిల్డ్రన్ పార్కు, రాకెట్ పార్కు, క్షత్రియ కల్యాణ మండపం, నార్త్ ఎక్స్‌టెన్షన్, టీపీటీ కాలనీ, పీ అండ్ టీ కాలనీ, నక్కవానిపాలెం ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మత్రిపాలెం: జోన్-2 పరిధి ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఫీడర్, మత్రిపాలెం పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు 11 కేవీ మత్రిపాలెం సెక్షన్, ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ ఫీడర్ నిర్వహణలో భాగంగా మత్రిపాలెం ఎస్టేట్‌లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

గడప గడపకూ సంక్షేమ ఫలాలు


దుస్తులు ఇస్త్రీ చేస్తూ పథకాల అమలును అడిగి తెలుసుకుంటున్న కె.కె.రాజు

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు రాంజీ ఎస్టేట్ సచివాలయాల పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలవుతున్న తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ అర్హత గల ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు పారదర్శకంగా అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి, యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, నాయకులు, కార్యకర్తలు, జీవీఎంసీ, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వివేకానందుడి ఆశయాలు నెరవేరుద్దాం


వివేకానందుడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న వీవీవైఎం సభ్యులు, రొంగలి జగన్నాథం

మురళీనగర్: స్వామి వివేకానంద ప్రవచించిన బోధనలు అందరూ పాటిస్తూ ఆయన ఆశయాలు నెరవేరుద్దామని వాకర్స్ డిస్ట్రిక్ట్-101 గవర్నర్ ఉప్పలపాటి శుభ పిలుపునిచ్చారు. వివేకానందుడి జయంత్యుత్సవం సందర్భంగా మురళీనగర్ ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో విశాఖ వివేకానంద యువ మహామండలి ఆధ్వర్యంలో గురువారం యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబద్ధత, అంకితభావం, త్యాగం వంటి ముఖ్య లక్షణాలను యువకులు అలవరుచుకుని దేశాభివృద్ధికి తోడ్పడాలన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, యలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి రొంగలి జగన్నాథం మాట్లాడుతూ ఆధ్యాత్మిక పార్కు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ముందుగా వివేకానందుడి నిలువెత్తు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కు నుంచి వర్మ కాంప్లెక్సు మీదుగా వాకర్స్ పార్కు, వైశాఖి స్పోర్ట్స్ పార్కు వరకు యుజన చైతన్య ర్యాలీ నిర్వహించారు. వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు వి.జయప్రభాశర్మ, వివేకానంద యువ మహామండలి ఉపాధ్యక్షుడు జీవీ రత్నం, కార్యదర్శి విద్యాధరసింగ్, డి.వెంకటరావు, ఎస్.నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి డి.నరసింహారావు, పార్కు అధ్యక్షుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాక్సింగ్ చాంపియన్‌షిప్ విజేతలకు సత్కారం


విజేతలను అభినందిస్తున్న గొర్లె చందు, రఘురామ్

కంచరపాలెం: ప్రకాశం జిల్లా ఒంగోలులో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విశాఖ క్రీడాకారులు, రన్నర్స్ అనకాపల్లి క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. ప్రతిభ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో గురువారం కైలాసపురం డీఎల్‌బీ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో విజేతలను ముఖ్య అతిథులు జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యల్లపు రఘురామ్, చీఫ్ అడ్వైజర్ గొర్లె చందు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయన్నారు. క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. బెస్ట్ బాక్సర్స్, బెస్ట్ పర్‌ఫార్మర్స్ కె.భవాని ప్రసాద్, సెక్రటరీ అమ్మోరు, ఆర్‌వోసీ రోబిన్, కోచ్‌లు శ్రీను, శివ, సత్యనారాయణలను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రిఫరీస్ ఎస్.భద్రయ్య, బి.కనకరాజు, బి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ దేవరాయ సంఘ కార్యదర్శి రంగారావు మృతి


రంగారావు(ఫైల్)

మురళీనగర్: మురళీనగర్‌కు చెందిన శ్రీకృష్ణ దేవరాయ సంక్షేమ సంఘం ప్రస్తుత కార్యదర్శి వానపల్లి రంగారావు(73) అకస్మాత్తుగా మృతి చెందారు. శ్రీకాకుళంలో ఒక సమావేశానికి వెళ్లిన ఆయనకు గుండెపోటు రావడంతో మరణించినట్లు మురళీనగర్ రామాలయ కమిటీ కార్యదర్శి సనపల వరప్రసాద్ తెలిపారు. మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ పూర్వ సంయుక్త కార్యదర్శిగా, మురళీనగర్ రామాలయ కమిటీ సీనియర్ సభ్యుడిగా రంగారావు సేవలందించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్, సీనియర్ న్యాయవాది పృథ్వీరాజ్, జనసేన నాయకురాలు పసుపులేటి ఉషా కిరణ్, సురక్ష ఆస్పత్రి అధినేత బి.రఘు, సంకు వెంకటేశ్వరరావు సంతాపం తెలిపి రంగారావు కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఎన్‌పీఎస్‌ను రద్దు చేయాలని ఆందోళన


కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న కార్మికులు

తాటిచెట్లపాలెం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన న్యూ పెన్షన్ స్కీం(ఎన్‌పీఎస్)ను రద్దు చేసి, పాత విధానాన్నే కొనసాగించాలని కోరుతూ ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ క్యారేజ్ అండ్ వేగన్ విభాగం ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. మత్రిపాలెంలోని క్యారేజ్ అండ్ వేగన్ బ్రాంచ్ కార్యాలయం వద్ద జాతీయ యువజన దినోత్సవాన్ని ఓల్డ్ పెన్షన్ డేగా నిర్ణయించి దీనికోసం కార్మికులందరూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో క్యారేజ్ అండ్ వేగన్ బ్రాంచ్ సెక్రటరీ సూర్యప్రకాష్, ప్రెసిడెంట్ రవికుమార్, ట్రెజరర్ దిలీప్‌కుమార్, కార్యవర్గ సభ్యులు, యూత్ కమిటీ సభ్యులు, యూనియన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొలువుదీరిన వాకర్స్ క్లబ్‌ల కొత్త కార్యవర్గాలు


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్, మాధవధార మహిళా వాకర్స్ క్లబ్‌ల నూతన కార్యవర్గాలు గురువారం కొలువుదీరాయి. స్థానిక వాకర్స్ పార్కులో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.పి.రవీంద్ర సమక్షంలో వాకర్స్ డిస్ట్రిక్ట్-101 గవర్నర్ ఉప్పలపాటి శుభ వాకర్స్ క్లబ్ కొత్త సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా పల్లా చంద్రమౌళి, ఉపాధ్యక్షులుగా మల్ల రామకృష్ణ, ఆదిభట్ల రామకృష్ణ, కార్యదర్శిగా లంకా వెంకటసుధాకర్, కోశాధికారిగా జె.కూర్మారావు, జాలీ వాకర్‌గా ఎస్.ప్రకాశరావు, డైరెక్టర్లుగా యడ్ల దేముడు, బి.సూర్యనారాయణ, ఎం.శ్రీరామమూర్తి, ఆర్.వెంటరమణ, వి.అప్పారావు, టి.వి.రామారావు, ఎస్.సీతారామకృష్ణ, పి.కుమార్‌రాజా, పి.చెల్వరాజ్ ప్రమాణం చేశారు.

మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలిగా ఎం.శేషామణి, ఉపాధ్యక్షులుగా లీలానాయుడు, సిహెచ్.వరలక్ష్మి, కార్యదర్శిగా సనపల పుష్పలత, సంయుక్త కార్యదర్శిగా జి.జయశ్రీ, కోశాధికారిగా సిహెచ్.లక్ష్మి, జాలీవాకర్‌గా ఎ.మాధవీలత, డైరెక్టర్లుగా ఎ.రాధ, ఎల్.వి.ఎస్.హిమబిందు, ఎస్.కృష్ణవేణి, జి.మహాలక్ష్మి, జి.లక్ష్మి, ఎం.మహాలక్ష్మి, పి.సుభాషిణి, పి.యశోధసుధ ప్రమాణ స్వీకారం చేశారు. డాక్టర్ రవీంద్ర మాట్లాడుతూ నూతన కార్యవర్గ సభ్యులు సమన్వయంగా పనిచేసి వాకర్స్ క్లబ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలన్నారు. వాకర్స్ ఫౌండేషన్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీలు ఏఎస్ఎన్ ప్రసాద్, ఏహెచ్ఎన్ వెంకటరావు, వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు ఎస్.హెచ్.కృష్ణారావు, అదనపు సెక్రటరీ జనరల్ ఆర్.సత్యనాథం, ఆర్‌సీ-5 ఎ.లక్ష్మీరెడ్డి, ఎలక్ట్ గవర్నర్ టి.రంగారావు, సెక్రటరీ జనరల్ శీలం ఐజాక్, కార్యదర్శి కె.ద్వారకానాథ్, ఎస్.బుచ్చయ్య, మహిళా వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షురాలు కె.మాధవి పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com